అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 29 జూన్ 2024 పేజీలు : 04



# గత ఐదేళ్లలో ఏం చేశారు.. లెక్కలన్నీ తీయండి

## - రెండు జిల్లాల డిఆర్‌డిఏ పిడిలు, ఏపిఎంలకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం



మాట్లాడుతున్న మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, జూన్ 28 ప్రభాతవార్త బ్యూరో**

గత ఐదేళ్లలో రాప్తాడు నియోజకవర్గంలో అమలైన పథకాలు, రుణాలు తదితర వివరాలన్నీ బయటకు తీయాలని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల డిఆర్‌డిఏ పిడిలు, ఏపిఎంలతో అనంతపురం క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఒకటవ తేదీ నుంచి పింఛన్ల పంపిణీ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఇంటి వద్దకే ప్రతి ఒక్కరికీ పంఛన్ అందాలన్నారు. అలాగే స్వయం సహాయక సంఘాలకు గత ఐదేళ్లలో అందిన సాయం వారి సమస్యలు ఏంటి అన్న అంశాల గురించి ఆరా చేశారు. మహిళా సంఘాల రుణాలు మంజూరులో జరిగిన అవకతవకల గురించి తెలుసుకుని వాటిపై చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులు పూర్తిగా దారి మళ్లడంపై ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివోఏల పనితీరు గ్రామాల్లో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయన్న అంశాల గురించి కూడా ఆరా తీశారు. మహిళలకు జీవనోపాధులు గత ఐదేళ్లలో ఏం కల్పించారన్నది తెలుసుకున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన కోసం ఎలా ముందుకెళ్లాలనే అంశంపై ఒక నివేదిక సిద్ధం చేయాలన్నారు. మండల, గ్రామ సమాఖ్యల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. మరోవైపు తోపుదుర్తి సహకార డెయిరీ స్థితిగతులు ఏంటన్నది ఆరా తీశారు. మొత్తం అందులో ఎంత మంది మహిళలు పెట్టుబడి పెట్టారు. ఎప్పుడు వారికి ఇంత సొమ్ము చెల్లించారు. ఇప్పటి వరకు వారికి ఎలాంటి లబ్ది క లిగింది. వంటి అంశాలపై సమగ్రమైన రిపోర్టు ఇవ్వాలన్నారు. అలాగే ప్రస్తుతం ఆ డెయిరీ పరిస్థితి ఏంటి అన్నది కూడా తెలుసుకున్నారు. శుక్రవారం కూడా పరిటాల సునీతకు శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు నాయకులు తరలివచ్చారు.

# పల్లా శ్రీనివాసరావు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతమవుతుంది

## - రాష్ట్ర అధ్యక్షుడు పల్లాని కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

## - జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్‌తో కలిసి శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**అనంతపురం అర్బన్, జూన్ 28 ప్రభాతవార్త**

పల్లా శ్రీనివాసరావు నాయకత్వంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ మ రింత బలోపేతమవుతుందని, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు, విజయవాడలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ కార్యకర్తల సమక్షంలో బాధ్య తలు స్వీకరించారు. ఈసందర్భంగా అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, కోడుమూరు ఎమ్మెల్యే దసప్తగిరి లతో కలసి దగ్గు పాటి పల్లా శ్రీనివాసరావు కలిశారు. పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. గతంలో అచ్చెన్నాయుడు వైసీపీని ఎదుర్కొని సమ ర్థవంతంగా పని చేశారన్నారు. ఇప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చిం దని, ఇలాంటి సమయంలో పార్టీ మరింత కీలకం కానుంద న్నారు. గతంలో విశాఖపట్నం పార్లమెంట్ పార్టీ అధ్యక్షునిగా పనిచేసిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఈ బాధ్య తల్ని సమర్ధవంతంగా నిర్వహి ంచ గలరన్నారు. రానున్న రోజుల్లో వైసీపీ మనుగడ కూడా ప్రశ్నార్థక మవుతుందని దగ్గుపా టి ప్రసాద్ తెలిపారు.

# అంటకాగాల్సిందే.. వంతపాడాల్సిందే..!

## - 'ఉపాధి' కోసం కాసులిచ్చుకో..బినామీలు రాసుకో..! - క్షేత్రసహాయకులపై పెరుగుతున్న రాజకీయ పెత్తనం..!

**తాడిపత్రి, జూన్ 28, ప్రభాతవార్త:**

భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో వేతన దోపిడీ పెరిగిపోతోంది. ప్రభుత్వాలు వెచ్చిస్తున్న ఉపాధి వేతనాలు సొమ్ము పెద్ద ఎత్తున నేతల పరమవుతోందనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఏ ప్రభుత్వమొచ్చినా ఆ అయిదేళ్లూ పనొకరిది సొమ్మొకరిది అన్నట్లు కష్టజీవుల సొమ్ములు నేత ఖాతాల్లో జమకావాల్సిందే. నేతల సిఫార్సులతో విధుల్లో చేరిన కింది స్థాయి సిబ్బంది వారిని ప్రసన్నం చేసుకోవడానికి బినామీ పేర్లతో హాజరువేసి అసలైన కూలీలతో పాటు అక్రమ సొమ్మును నేతల ఖాతాల్లో జమచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అధికారులు ఫిర్యాదులను తొక్కిపెట్టేస్తుండటంతో పెద్దఎత్తున నిధుల స్వాహా చోటు చేసుకుంటోంది. ప్రభుత్వాలు మారిన ప్రతి సారీ ఆ పార్టీ ఈ పార్టీ అని లేకుండా స్థానిక నాయకులు తమ అడుగులకు మడుగులొత్తే క్షేత్ర సహాయకులను నియమించుకోవడం, అందినకాడికి దోచుకోవడం పరిపాటిగా మారింది.

**- ఉపాధి ఉద్దేశ్యం పక్కదారి..!**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా దాదాపు 6.20 లక్షల కుటుంబాలకు చెందిన 12.15 లక్షల మంది కూలీలకు పనులు కల్పించడానికి సుమారు 937 మంది క్షేత్రసహాయకులు విధులు నిర్వహిస్తున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో 85 పంచాయతీల్లోని 21,525 కుటుంబాలకు పనులు కల్పించడానికి 83 మంది క్షేత్ర సహాయకులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఏడాదికి వందరోజుల పనిదినాలు కల్పించి వారికి సామాజిక, ఆహార భద్రత కల్పించడం కోసం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు. కానీ నాయకుల పెత్తనం, వారిని ప్రసన్నం చేసుకునే బాటలో కొందరు క్షేత్ర సహాయకుల అవినీతి ఈ పథకానికి అపఖ్యాతి తెచ్చిపెడుతున్నాయి.

పేదలు కష్టపడి పనిచేస్తే..పనులకు వెళ్లని నేతలు, వారి కుటుంబ సభ్యుల ఖాతాల్లో సొమ్ములు జమవుతుండటంపై సర్వత్రా చర్చసాగుతోంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఆయా అధికార పార్టీ నాయకులు క్షేత్రసహాయకుల మార్పిడిపై తీవ్ర ఒత్తిడి చేస్తుండటమే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తే క్షేత్ర సహాయకుల సంపాదనకు అడ్డుఅదుపూ ఉండదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అయిదేళ్ల పాటు అధికార పార్టీ నాయకులకు వంతపాడితే సామాజిక తనిఖీల్లో తమ అవినీతి బయటపడినా పట్టించుకునే దిక్కు ఉండదని, అధికారం మారితే ఆ పార్టీ నాయకులకు ఉపాధిలో కాసులు ఎలా వెనకేసుకోవాలో చెబితే చాలు తమ ఉపాధికి ఢోకా ఉండదని పలువురు క్షేత్ర సహాయకులు భావిస్తుండటం అవినీతి పరాకాష్టకు నిదర్శనంగా చెప్పవచ్చు. రాజకీయ ఒత్తిళ్లను తట్టుకొని తమ ఉపాధిని కాపాడుకోవడానికి క్షేత్ర సహాయకులు తప్పనిసరి పరిస్థితుల్లో తప్పుటడుగులు వేస్తున్నారనే వాదనలు లేకపోలేదు. కాసులిచ్చుకో..బినామీలు రాసుకో అనేలా వ్యవహరించే నాయకులను ప్రసన్నం చేసుకోవడంతోనే తమ ఉపాధికి ఢోకా ఉండదనే భావనతో క్షేత్ర సహాయకులు ఉండటం గమనార్హం.



ఉపాధి హామీ పనుల్లో కూలీలు

**- మా వాళ్లను మంచిగా చూసుకోవాలి..!**

తమ పార్టీ గెలుపుకోసం పనిచేసిన వారికి ఉపాధి కల్పించడంలో భాగంగా ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులు మా వాళ్లను మంచిగా చూసుకోవాలనే ఆలోచనతో ఉపాధి హామీ పథకాన్ని ఎంచుకుంటున్నారు. ఇందులో క్షేత్రసహాయకులుగా తమవారిని నియమించుకుంటే వారికి ఉపాధినిచ్చినట్లుంటుంది, మరి కొందరు క్రియాశీలక కార్యకర్తలకు బినామీ సొమ్ము కట్టపెట్టినట్లవుతుందనే ఉద్దేశంతో నాయకులు పావులు కదుపుతున్నారు.

ఇలాంటి పనులకు మండల స్థాయి అధికారులతో పాటు, క్షేత్రస్థాయి సిబ్బంది, కొందరు కంప్యూటర్ ఆపరేటర్ల సహకారం మెండుగా ఉంటోంది. వీరంతా తాముకూడా ఆరగించే క్రమంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకుల ప్రసన్నం కోసం దోచిపెడుతున్నారు. ఉపాధిహామీ పథకంలో కీలకంగా మారిన క్షేత్రసహాయకులు క్షేత్రస్థాయి నాయకుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారుతుండటం ఉపాధి హామీ పథకం ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ పథకాన్ని కమ్ముకున్న నీలినీడలను ఉన్నతాధికారులు దూరం చేస్తే తప్ప తమకు న్యాయం జరగదని పలువురు ఉపాధి కూలీలు పేర్కొంటున్నారు.

# మడకశిర ప్రాంతంకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

## - మడకశిరను అభివృద్ధి చేయడమే మా ధ్యేయం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

## - నియోజకవర్గంలో త్వరలోనే మూడువేల మంది యువతీ యువకులకు ఉపాధి కల్పిస్తాం..

## - ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, గుండుమల తిప్పేస్వామి



ఇండియన్ డిజైన్‌గార్మెంట్ నిర్వాహకుల తో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీగుండుమల తిప్పేస్వామి

**మడకశిర టౌన్, జూన్ 28 ప్రభాతవార్త**

మడకశిర నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలతోనే సాధ్య పడుతుందని, త్వరలో గార్మెంట్ పరిశ్రమలు ఏర్పాటు చేసి, 3వేల మందికి ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మె ల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. శుక్రవారం కర్ణాటక ప్రాంతం బెంగు ళూరులో ఇండియన్ డిజైన్ గార్మెంట్ పరిశ్రమ నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఇప్పటికే మడకశిర హిందపురం రోడ్‌లో ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి అయ్యింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఓ మాజీ ప్రజా ప్రతినిధి కొన్ని అడ్డంకులు ఉండడం వల్ల ప్రారం భానికి గార్మెంట్ నిర్వాహకులు ముందుకు రాలేకపోయారని, టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిశ్రమిక వ్యక్తులు సైతం పరిశ్రమల ఏర్పాటు చేయ డం కోసం ముందుకు వస్తున్నారని వారు తెలిపారు. బెంగుళూరులో ఉ న్న ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఫ్యాక్టరీని పరిశీలించారు. గార్మెంట్స్ పారిశ్రా మిక అధినేత జావిద్ ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో సమావేశం నిర్వహించారు. సీక్రెట్ సమీపంలో గార్మెంట్ నిర్మాణం పూర్తి అయింది. త్వరలోనే గార్మెంట్ పరిశ్రమ ప్రారంభిస్తామని వారికి కోరారు. అందుకు వారు కూడా సానుకూలంగా స్పందించి ముందుకు వచ్చి ఇండియన్ డిజైన్ గార్మె ంట్ పరిశ్రమను ప్రారంబిస్తా మని వారు తెలిపారు. నియోజ కవర్గంలోని ప్రజలకు 3వేల మందికి ఉపాధి కల్పించే విధంగా చేస్తామన్నారు. అనం తరం టెక్స్ పోర్ట్ ఓవర్సీస్ గార్మెంట్ పరిశ్రమ ప్రతినిధు లతో సమావేశం నిర్వహించా రు. సంస్థ సీఈఓ అమిత్ రా య్, ఎండి సోమశేఖర్లను కలి శారు. గుడిబండ మండలం అమరాపురం గుడిబండ , అగళి మండలాల్లో నిరుద్యోగ యువతీ యువకులకు టెక్స్‌టైల్స్ పరిశ్రమల్లో ఉపాధి అవకాశం కల్పించాలని వారిని కోరారు. అందుకు ఆ సంస్థ నేతలు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీని వాస్‌మూర్తి, కన్వీనర్ దాసిరెడ్డి, మహేష్, రామకృష్ణ తదిత రులు పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనకు విస్తృత ప్రోత్సాహం

## -జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ , హాజరైన అధికారులు

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 28 ప్రభాతవార్త**

జిల్లాలోని ఉపాధి అవకాశాలు సృష్టించే తయారీ, సేవారంగ పరిశ్రమలకు విస్తృత ప్రోత్సాహం కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పరిశ్రమ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 48వ జిల్లా పరిశ్రమల, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా ప్రోత్సాహించాలని ఆదేశించారు. సింగిల్‌విండో పోర్టల్‌లో పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకుననఅనుమతులను నిర్ణీత సమయంలో ఆమోదించవల్సిందిగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫ్యాక్టరీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2015-20 ఇండస్ట్రియల్ పాలసీలో 1 యూనిట్‌కు గాను 2.98 లక్షల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. జిల్లాలో 2020-23 ఇండస్ట్రియల్ పాలసీలో 4 యూనిట్లకు గాను 25.51 లక్షల రూపాయలు సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. జిల్లాలో 2023-27 ఇండస్ట్రియల్ పాలసీలో 11 యూనిట్లకు గాను 154.75 లక్షల రూపాయల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. పిఎంఈజిపి పథకం ద్వారా రుణం మంజూరు అయిన యూనిట్లు అన్ని గ్రౌండ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఎల్‌డిఎం, జిల్లా పరిశ్రమల అధికారులను ఆదేశించారు. జిల్లాలో రాబోవు భారీ పరిశ్రమల సమస్యలు తెలుసుకుని ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు ప్రస్తుతం వున్న వివిధ పరిశ్రమలు జారీ చేస్తున్న అనుమతులు వేగవంతము చేయడానికి పారదర్శకత పెంచడానికి ఇంకా ఏదైనా సమస్యలు వుంటే వాటిని జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ దృష్టికి తీసుకరావాలన్నారు. ఇండస్ట్రియల్ పార్కు, గుత్తిలో స్థాపించిన నందిని ఫుడ్, సమీ సిమెంట్స్ ప్లై యాస్ బ్రిక్స్, ఎంఎస్ఎంఈ, రాప్తాడు పార్కులో స్థాపించిన సప్తగిరి గ్రానైట్స్ ఇండస్ట్రీస్‌లకు సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ ఇవ్వడానికి ఏపిఐఐసికి అనుమతించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి జి.నాగరాజారావు, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్, వ్యవసాయశాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ సురేంద్ర, డిటిసి వీర్రాజు, ఎల్‌డిఎం నరసింగ్‌రావు, ఏపిపిసిబి ఈఈ కిషోర్‌రెడ్డి, డిపిఒ ప్రభాకర్‌రావు, ఏపిఎస్ఎఫ్‌సి బ్రాంచ్ మేనేజర్ మహేష్, ఫ్యాక్టరీస్ డిప్యూటి చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆదికేశవులు, ఎస్ఇ కార్పోరేషన్ ఈడి సారయ్య, డిటిడబ్ల్యుఒ రామాంజినేయులు, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, డిటిసిపిఒ సువర్ణ, నెడ్ క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కిషోర్‌రెడ్డి, ఏపిఐఐపి డిజెడ్ఎం నాగార్జునరావు, కమర్షియల్ ట్యాక్స్ ఏసి సంజీవరెడ్డి, హార్టికల్చర్ డిడి ఫిరోజ్‌ఖాన్, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, ప్యాప్సి ప్రెసిడెంట్ శేషాంజనేయులు, ప్యాప్సి య ప్రతినిధి నాగరాజు, డిక్కీ ప్రతినిధి చిన్నవెంకటేష్, పరిశ్రమలశాఖ ఏడి రాజశేఖర్‌రెడ్డి, టిక్కీ ప్రతినిధి రామాంజినేయులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ కూటమితో రాయదుర్గం అభివృద్ధి...

## - రాయదుర్గం నుండి ఢిల్లీ వరకు ఎన్డీఏ అధికారం - దుర్గం ప్రజల రుణం తీర్చుకుంటా.... ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు - ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులను ఘనంగా సన్మానించిన బిజెని నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

**రాయదుర్గం, జూన్ 28 ప్రభాతవార్త:**

రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధి ఎన్డీఏ కూటమి తోనే అభివృద్ధి చేస్తామని, రాయదుర్గం ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సీతారామాంజినేయ కళ్యాణమంటపంలో బిజెపి నాయకులు ఎమ్మెల్యేకాలవ శ్రీనివాసులుకు అభినంద సభ ఏర్పాటుచేసి కాలవను ఘనంగా శాలువాలు వేసి సత్కరించారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాలవ శ్రీనివాసులు మాట్లా డుతూ కేంద్రంలోను, రాష్ట్రంలోను, రాయదుర్గంలోను ఎన్డీఏ కూటమి అధికా రంలో ఉందని, పార్టీలు ఏదైనా కూటమి అన్నప్పుడు అందరూ బాగస్వా ములవుతామని, తెలుగుదేశం, జనసేన, బిజెనిపార్టీలు ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలలో ఉన్నాయన్నారు. భలమైన నాయకత్వం కేంద్రంలో ఉండాలని నరేంద్రమోడిని, విభజన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. చంద్రబాబునాయుడు సుదీర్ఘమైన పరిపాలనతో రాష్ట్ర దుస్థితిని, స్థితిని మార్చాలనే ఎన్నో ఆశయలతో నాయకత్వాన్ని ఏర్పాటు చేసుకున్నాడన్నారు. రాష్ట్రంలో కూటమి 164స్థానాలు సాధించిందని, ఇంత గొప్ప విజయాన్ని సాధించిన ప్రలందరికి శిరస్సు వంచి నమస్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో గ్రామాల్లో సమగ్రపరిష్కారం కావాలని, ప్రజలకు ప్రభుత్వం నుండి మెరుగైనసేవలు అందాలని, వ్యవసాయ కూలీలు, రైతులు, దళితులు, మైనార్టీలు, బీసీలు, మహిళలు, వివిధ వర్గాల వారు బాగుపడాలంటే కలిసి కట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉమ్మడి అజెండాలో తెలుగుదేశం పార్టీ, భార తీయ జనతాపార్టీ సమానంగా ఉందని, ప్రజలమన్ననలు పొందాలన్నారు. భారతీయ జనతాపార్టీ నుండి సత్యకుమార్‌కు క్యాబినెట్‌లో అవకాశం కల్పించారని, జనసేన పార్టీనుండి పవన్ కళ్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి పధవితోపాటు వివిధశాఖలు అందించారని, తెలుగుదేశం పార్టీలో కూడా చాలా మందికి మంత్రి పధవులు అందాయన్నారు. మంత్రి పధవి ఉంటేనే ప్రజాసేవచేయాలని ఏమీలేదని, ఎమ్మెల్యేగాను ప్రజా సేవలు చేయవచ్చని, అత్యంత వెనుకబడిన ప్రాంతం రాయదుర్గం అభివృద్ధి పై మనమం దరం కలిసి కట్టుగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. రాయదుర్గంకు మెరుగైన సేవలు అందించాలని, సేవలు చేయాలని ఆయన తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అమలుచేసి వాటిని అమలు చేయాడానికి సమ యాత్తం అవుతున్నామని, కానీ నిధుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కానీ ప్రధాన మంత్రి మోడీసహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంను అన్నిరకాలుగా ఆదుకుంటారని ఆయన తెలిపారు. కావున ప్రతి ఒక్కరి సహకారంతో రాయదుర్గం అభివృద్ధికి సహాయ సహకారాలు అంది ంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీనాయకులుఅంబోజీరావు,జింకా వసుంధరదేవి, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సవితమ్మను కలిసిన పుట్లూరు మండల టిడిపి నాయకులు



మంత్రి సవితమ్మను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

**పుట్లూరు, జూన్ 28 ప్రభాతవార్త**

పుట్లూరు మండల తెలు గుదేశం పార్టీ నాయకులు శుక్రవారం పెనుకొం డలో బిసి సంక్షేమం, చేనేత జౌళిశాఖా మంత్రి సవితమ్మను మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈసందర్భంగా మండల తేదేపా నాయకులు గోవర్ధన్‌రాజు, లింగమూర్తి, హర్షవర్ధన్‌చౌదరి, నాగార్జు న, నాయుడు, తది తరులు మంత్రిని కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సత్కరించి అభినం దనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి సమా జానికి ఉన్నతమైన సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు.

# గ్రామీణ రహదారులు, హెచ్‌ఎల్‌సి కాలువపై ఉన్న బ్రిడ్జిల నిర్మాణం చేపట్టండి

**పుట్లూరు, జూన్ 28 ప్రభాతవార్త**

గ్రామీణ రహదారులతో పాటు హెచ్‌ఎల్‌సి కాలువలపై వున్న బ్రిడ్జిలు తిరిగి నిర్మాణాలు చేపట్టాలని భారతీ య జనతాపార్టీ శింగన మల నియోజకవర్గం అసెంబ్లీ కో కన్వీనర్ కుందు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం శింగనమల నియోజ కవర్గం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గంలోని పలుమండలాల్లోని గ్రామాల్లో గ్రామీణ రహదారులను గతప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పుట్లూరు మండల కేంద్రం నుండి మోడల్‌స్కూల్, హైస్కూల్, కస్తూరిబా పాఠశాలలకు రోడ్ల వసతి, హెచ్‌ఎల్‌సి కెనాల్ మీద బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటిని తిరిగి నిర్మించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో నార్పల మండల అధ్యక్షులు కుమ్మరి కాశీవిశ్వనాథ్, ఎస్‌సి మోర్చా మండల అధ్యక్షు లు అయ్యప్ప, పుట్లూరు మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి, నరసిం హారెడ్డి, ప్రధాన కార్యదర్శి హరినాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

## డయేరియా నివారణకు అవగాహన



మాట్లాడుతున్న మండల అధికారులు

**బెలుగుప్ప, జూన్ 28 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో డయేరియా నివారణకు విషయాలపై చర్చించడానికి మండలంలో ఉన్న పంచాయితీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ.. మండలంలో ఉండే ట్యాంకుల్లోని నీటిని ఫ్లోరియేషన్ చేయాలని, 1000 లీటర్లకు 40 గ్రాముల బ్లీచింగ్ పౌడర్ ఫ్లోరేషన్ చేయాలని, ప్రతి ఒక్కరూ గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని పరిసరాలను నీటి నిల్వ ఉంటున్న ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, పైపులకు, వాటర్ ట్యాంకులకు ప్రతి ఒక్కరూ రిపేరీ చేసి వాటర్‌ను వదలాలని తెలిపారు. ప్రతి స్వచ్ఛభారత్ కార్మికుడు సేకరించిన తడి చెత్త, పొడి చెత్తను స్ప్రేచేసి షెడ్డులో నిల్వ ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి హర్ష వర్ధన్‌రెడ్డి, విస్తీర్ణ అధికారి మాధవరెడ్డి, సప్రిన, పంచాయితీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

## కాలవపల్లి, అనిమిరెడ్డిపల్లి గ్రామాలకు విద్యా సామాగ్రి పంపిణీ



ఏజిఎస్ వ్యవస్థాపకులు జి.ప్రమీళమ్మ విద్యా సామాగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

**బెలుగుప్ప, జూన్ 28 ప్రభాతవార్త**

మండల పరిధిలో అనిమిరెడ్డిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల, కాలవపల్లి ప్రాథమిక పాఠశాలకు ఏజిఎస్ వ్యవస్థాపకులు జి.ప్రమీళమ్మ పుస్తకాలు, నోట్ పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్స్ డిక్షనరీలు లాంటివి విద్యార్థులకు అందజేస్తూ అన్నిదానాల కన్నా విద్యా దానం గొప్పదని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు విద్యా సామాగ్రి పంపిణీ



టిడిపి నాయకులు విద్యా సామాగ్రిని అందజేస్తున్న దృశ్యం

**బెలుగుప్ప, జూన్ 28 ప్రభాతవార్త**

మండల పరిధిలో బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, ప్యాడ్స్ తదితరాలు తెలుగుదేశం పార్టీ నాయకులు కృష్ణ స్వామి, బోయ ఆంజినేయులు, మారెన్న, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మన్న, ఉపాధ్యాయులు వెంకటేషులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ పింఛన్‌పై అవగాహన సదస్సు



సచివాలయ ఉద్యోగస్తులకు ఎన్టీఆర్ పింఛన్లపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**బెలుగుప్ప, జూన్ 28 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ సుబ్బరాజు ఆధ్వర్యంలో జులై 1వ తారీఖున 230 క్లస్టర్ మ్యాపింగ్ సచివాలయ ఉద్యోగస్తులు మ్యాపింగ్ చేస్తారని, మండలంలో 5857 పింఛన్లు 1వ తారీఖు సచివాలయ ఉద్యోగస్తులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తారని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తీర్ణ అధికారి మాధవరెడ్డి, మండల సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## 1వ తేదినే పింఛన్లు తీసుకోండి

### - ఎంపిడిఓ చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఎంపిడిఓ చంద్రశేఖర్

**కుందుర్పి, జూన్ 28 ప్రభాతవార్త**

సజావుగా పింఛన్ల పంపిణీ చేయాలి, మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయితీలోని గ్రామాల్లో జులై 1వ తేదినే ఇంటింటికీ వెళ్లి సామాజిక పెంచల పంపిణీ చేయాలని ఎంపిడిఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కొందరిపై మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ సిబ్బందికి పెంచల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ.. జులై 1వ తేదిన ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీలైనంతవరకు గ్రామంలోని అన్ని పెన్షన్ పంపిణీ చేయాలని సూచించారు. ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు తెదేపా నాయకులను ఆహ్వానించి పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు అధికారులతో సంప్రదించి సమస్యలు లేకుండా పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహశీల్దార్ తిప్పేస్వామి వెలుగు ఏపిఎం హుస్సేన్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ శ్యాంసుందర్ గ్రామ పంచాయితీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జెసిబితో ఆరోగ్య కేంద్రం పరిశుభ్రత



జెసిబితో పరిశుభ్రం చేయిస్తున్న దృశ్యం

**కుందుర్పి, జూన్ 28 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో చెత్తచెదారం పేరుకుపోయి పిచ్చి ముక్కలు గడ్డి మొక్కలు మొలిచి తీవ్ర అపరిశుభ్రత నెలకొనగా మండల కేంద్రానికి చెందిన సజ్జల లక్ష్మణ మూర్తిల దాత శుక్రవారం జెసిబి ఏర్పాటు చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. దాంతో గ్రామస్తులు ఆసుపత్రి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దాత లక్ష్మణమూర్తి మాట్లాడుతూ.. ఆసుపత్రి అవరణలో పిచ్చి మొక్కలతో తీవ్ర అపరిశుభ్రత నెలకొందని దాంతో జెసిబితో పరిశుభ్రం చేసినట్లు తెలిపారు. త్వరలో ఆవరణలో ఫలాలనిచ్చే మొక్కలను నాటి సంరక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయితీ కార్యదర్శి మహబూబ్ బాషా గ్రామ సర్పంచు మారుతీశ్వరి టిడిపి సద్దల రామమూర్తి వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉచిత గర్భకోశ పశువైద్యశిబిరం

**బ్రహ్మసముద్రం జూన్ 28 ప్రభాతవార్త,**



కార్యక్రమంలో వైద్యం అందిస్తున్న డాక్టర్ నవీన్

మండలంలోని కోనాపురం గ్రామంలో ఉచిన గర్భకోశ శిబిరం ను సర్పంచ్ వనితా మల్లికార్జున అధ్యక్షతన డాక్టర్ నవీన్‌కుమార్ నిర్వహించారు. పశువులలో చూడి తిరిగి ఎదకువస్తూ కట్టకుండా వున్న పూర్తిగా ఎదకు రానివాటికి పశువులకు వైద్యపరిక్షలు అందించారు. అనంతరం గ్రామంలో పశువులకు నట్టల నివారణకు సుమారు 50కు పైగా పశువులకు నావారణ మందులు తాపారు. ముద్దచర్మవ్యాది పశువులకు 200కు పైగా టీకాలు వేశారు. అనంతరం గ్రామ ప్రజలకు పశువులు వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పశువులు వ్యాదికి గురైనప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ప్రతి రైతు పాడిపశువులను పెంచి లాభాలను గడించాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

## సామాజిక ఫెన్షన్‌ల పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించిన ఎంపిడీఓ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడీఓ

**బ్రహ్మసముద్రం జూన్ 28 ప్రభాతవార్త,**

జూలై నెలలో సామాజిక ఫెన్షన్‌ల పంపిణీపై శుక్రవారం ఎంపిడీఓ దాసానాయక్ స్రీశక్తి భవన్‌లో మండంలోని సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడీఓ మాట్లాడుతూ ప్రతి సచివాలయంకు సంభదించిన ప్రతి ఉద్యోగి జూలై నెలకు సంభదించిన సామాజిక ఫెన్షన్ పంపిణీ కార్యక్రమంను ఉదయం 6 గంటలనుండి మెదలుపెట్టి ఫెన్షనర్ వారి ఇంటివద్దకేవెళ్ళి పంపిణీ కార్యక్రమం చేపట్టాలని సూచించారు ఫెన్షన్‌ల పంపిణీలో ఎఉద్యోగి అయినా అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలకు భాద్యులు అవుతారని అన్నారు.

## ఘనంగా ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించాలి

**శెట్టూరు, జూన్ 28 ప్రభాతవార్త**



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ఎమ్మార్పిఎస్ ఉద్యమ పురిటి గడ్డ ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో జులై 7న ఎమ్మార్పిఎస్ ఆ విర్భావ దినోత్సవం సందర్భంగా మాదిగల జన జాతర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అనంతపురం జిల్లా అధ్యక్షులు సాకే గురుమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాటంలో మనం ఏం సాధించామో ఏం కోల్పోయామో ఎక్కడ మోసపోయాము ఎన్ని ఆటుపోట్లు తిన్నామో ఎన్ని బలిదానాలు జరిగాయా ఇప్పుడు ఎక్కడ ఉన్నాము అని పునరాలోచన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు అనపల్లి రామన్న, కృష్ణాపురం బాబు, పిల్లలపల్లె అనిల్‌కుమార్, యాటకల్లు రామమూర్తి, కనకూరు శివ చింతలపల్లి మైలారి, శెట్టూరు మండల అధ్యక్షులు వెట్టి తిప్పేస్వామి, మండల గౌరవాధ్యక్షులు అనంపల్లి మారన్న, మండల అధికార ప్రతినిధి అనంపల్లి పాలక్షి, మండల నాయకులు అనపల్లి రామాంజినేయులు, ములకలేడు మనోజ్, కంబదూరు మండల అధ్యక్షులు గంపల రామాంజినేయులు, కుందుర్పి మండల నాయకులు, కరిగానపల్లి చంద్ర, కళ్యాణదుర్గం మండల నాయకులు బొట్టు వానపల్లి తిప్పేస్వామి, ఎమ్మార్పిఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత గర్భ కోశ చికిత్సా శిబిరం ఏర్పాటు



మాట్లాడుతున్న డాక్టర్లు

**శెట్టూరు, జూన్ 28 ప్రభాతవార్త**

90 శాతం కచ్చితత్వంతో పేయి దూడల పుట్టుకను ఉద్దేశించి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయు పథకం ప్రాచుర్యనిమిత్తం, ఆ పథకానికి మంచి పశువుల ఎన్నికకు, రైతుల అవగాహన కొరకు, గ్రామంలో అన్ని పశువులను పరీక్షించుట కొరకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరము ఏర్పాటు చేయడమైంది. 1350/ విలువ గల రెండు సూదులను, 850 సబ్సిడి పోగా 500 మాత్రమే చెల్లిస్తే, మొత్తంగా పేయిదూడలను పొందే సూదులను ప్రభుత్వం వారు సరఫరా చేస్తున్నారని తెలిపారు. పైగా రెండు సూదులు వేసినా కట్టకపోతే 500 వాపస్ ఇవ్వడం, పొరపాటున కుర్ర దూడ పుడితే 250 వాపస్ ఇ వ్వడం, విదేశీ జాతులనే కాక స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్, తార్పర్కార్ వంటి కావలసిన బ్రిడ్‌లను ఎంపిక చేసుకొనే అవకాశం ఉండడం, పుట్టేది పేయిదూడ క నుక ఈనునప్పుడు ఆవుకు కష్టం లేకుండా ఈనడం, పుట్టే పేయిదూడ చూడి నిలిస్తే 20శాతం అధజక పాలనిచ్చే శక్తి కలిగి ఉండడం అనునవి ప్రత్యేక లాభదాయకమైన అంశమలని డిఎల్‌డిఏ, అనంతపురం జిల్లా కార్యనిర్వహణాధికారి డా.టి.సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు తిమ్మరాజు, డాక్టర్ టివి సుధాకర్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అనంతపురం, డాక్టర్ నాగలింగేశ్వరరెడ్డి, సహాయ సంచాలకులు, డాక్టర్ బి.ప్రసాద్ పశువైద్యులు శెట్టూరు, ఎహెచ్ఎ, జిఎం తదితరులు పాల్గొన్నారు.

## ఫింఛన్ల పంపిణీ సక్రమంగా జరగాలి...



ఫింఛన్ల పంపిణీపై సూచనలిస్తున్న ఎంపిడిఓ జి.రఘునాథ్

**డి.హీరేహాళ్, జూన్ 28 ప్రభాతవార్త:**

ఫింఛన్ల పంపిణీ సక్రమంగా జరగాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అవ్వ, తాతలు, దివ్యాంగులు, మన్ననులు పొందాలని పంపిణీలో పాల్గొంటున్న సిబ్బందికి ఎంపిడిఓ జి.రఘునాథ్ సూచనలు ఇచ్చారు. శుక్రవారం డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఆయన పాలనాధికారి బలరాంరావుతో కలిసి సచివాలయ,



సమావేశానికి హాజరైన ఆయా శాఖల సిబ్బంది..

వెలుగు ఇతర శాఖల సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులతో జూలై 1వ తేదీన పంపిణీ చేయనున్న ఫింఛన్ల విషయంపై దిశా నిర్దేశం చేశారు. ఈ దీర్ఘకాలిక ఫింఛన్లు శనివారం బ్యాంకు నుండి డబ్బులు డ్రాచేసి జూలై 1వ తేదీన సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రతి లబ్దిదారుడికి ఫింఛన్లు చేరేలా పనిచేయాలని ఆయన సూచనలు ఇచ్చారు. మండల పరిధిలోని 16పంచాయితీల్లో 5212మందికి రూ.3.56కోట్ల ఫింఛన్ల సొమ్ము వంద మంది సిబ్బంది చేత పంపిణీ చేయడం జరుగుతుందని ఒక్క రోజులోనే పంపిణీ ముగించాలని ఎంపిడిఓ సిబ్బందిని ఆదేశించారు. వృద్దులకు అదనపు ఫింఛన్లతో కలిపి రూ.7,000లు, దివ్యాంగులకు రూ.15,000లు ఫింఛన్లు అందివాల్సి ఉంటుందని ఫింఛనల్ల పంపిణీలో సిబ్బంది ఎవరైనా తాస్కారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంకు పంచాయితీ కార్యదర్శులు ఏఎస్‌వి రమణ, కృష్ణయ్య, నాగరాజు, రాజు, హైమావతి, సోమనాథ్, వెలుగు సిఓలు వేణుగోపాల్, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## నిజాయితీగా ఉన్న అధికారులను నియమించండి

### - బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందనూరు నాగరాజు

**రాయదుర్గం, జూన్ 28 ప్రభాతవార్త:**



బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందనూరు నాగరాజు

నిజాయితీగా ఉన్న అధికారులను ప్రభుత్వం నియమించాలని బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందనూరు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాయదుర్గంలో ప్రభుత్వ అధికారుల ఉద్యోగస్తుల బదిలీలు జరుగుతున్న తరుణంలో నిజాయితీగా ఉన్న అధికారులను నియమించాలని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన అధికారులను యధావిధి స్థానంలో నియమిస్తున్నట్లు మాకు సమాచారం తెలిసిందన్నారు. గతంలో మున్సిపాలిటికి సంబంధించిన కోట్లాది రూపాయల మున్సిపాలిటి ఆస్థులు అన్యాక్రాంతం జరిగిన విషయం ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. కోట్లాది రూపాయల్లో అవినీతికి పాల్పడిన అధికారులను, మరి యధా స్థానంలో ఉండడం వల్ల జరిగిన అవకతవకలను మభ్యపెట్టి గతంలో జరిగిన అవినీతికి సర్దుబాటు చేసే అవకాశం ఎంతైనా ఉందని, గతంలో ఉన్న మున్సిపల్ కమీషనర్ దివాకర్‌రెడ్డి పదవి బాధ్యతలు ఉన్నప్పుడు ఎన్నో అక్రమాలు మున్సిపాలిటిలో జరిగాయని గుర్తు చేశారు. ఇలాంటి అధికారులను కాకుండా నీతి నిజాయితీగా ఉన్న అధికారులను ప్రభుత్వం నియమించాలని ఆయన బిఎస్పీ పార్టీ దరుపున కోరారు. ఐదు సంవత్సరాలకు పైబడి ఎంతో మంది ఉద్యోగులు రాయదుర్గంలో తిష్ట వేసుకుని పధవిలో కొనసాగుతున్నారని, కొంతమంది అయితే పది సంవత్సరాలు నుండి ఇరవై సంవత్సరాలు గడిచినా ఒక్కటే చోటే ఉద్యోగాన్ని కొనసాగించడం గమనార్హం అన్నారు. వీళ్లకు పార్టీ అండ దండులు, లేకుంటే ఇతర లావాదేవీలు ఏమైనా ఉన్నాయా అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయన్నారు. కావున ప్రభుత్వం ఆలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అవినీతికి పాల్పడిన కొంతమంది ఉద్యోగులను రాయదుర్గం నియోజకవర్గంలో అడుగుపెట్టకుండా చూడాల్సిన ఆధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నీతిగా నిజాయితీగా పనిచేసే ఎంతో మంది అధికారులు, ఉద్యోగస్థులు ఉన్నారని, అలాంటి వారికి అవకాశాన్ని కల్పించాలని, అవినీతిపరుల నుండి రాయదుర్గంను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని ఆయన పేర్కొన్నారు.

## ఆల్ మర్చంట్ కమిటి సభ్యులు ఏకగ్రీవం



ఆల్ మర్చంట్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కోరి మల్లికార్జున

**డి.హీరేహాళ్, జూన్ 28 ప్రభాతవార్త:**

ఆల్ మర్చంట్ నూతన కమిటి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొని ఆల్ మర్చంట్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని శివలింగస్వామి మఠంలో ఆల్ మర్చంట్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అసోషియేషన్ అధ్యక్షుడిగా సందీప్ హార్డ్వేర్ యజమాని కోరి మల్లికార్జునను అసోషియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎర్రిస్వామి, కార్యదర్శి శివకుమార్, ఉప కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి ఈరన్న, సభ్యులు బసప్ప, ప్రదీప్, నవీన్, సూర్యప్రకాష్, మహేష్, బోగేష్, నవీన్, నాగేంద్రలను ఆల్ మర్చంట్స్ యజమానులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆల్ మర్చంట్స్ అసోషియేషన్ నూతన అధ్యక్షులు కోరి మల్లికార్జున మాట్లాడుతూ ఆల్ మర్చంట్స్ యజమానులు తమ పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కమిటి సభ్యులతో కలిసి సమస్యలు పరిష్కారానికి వంచన లేకుండా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

## కుంటుమారెమ్మకు ప్రతేక పూజలు

**రాయదుర్గం రూరల్, జూన్ 28 ప్రభాతవార్త :**



మండల పరిదిలోని మల్లాపురం గ్రామసమీపంలో వేలసిన కుంటుమారెమ్మకు శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అలయ అర్చకులు ఉదయన్నే అమ్మవారికి గంగాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్ప అలంకరణ, కుంకుమార్చన, మహామంగళ హారతులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వినియెగించారు. అమ్మవారిని ధర్శించు కొనేందుకు చుట్టు పక్కల గ్రామాలనుండి, రాయదుర్గం పట్టణంనుండి పెద్ద ఎత్తున భక్తదాలు హాజరై మెక్కులు తీర్చుకోన్నారు.

## ఫింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే క్షమించేది లేదు... ఎంపిడిఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ అల్లాబకాష్

**రాయదుర్గం రూరల్, జూన్ 28 ప్రభాతవార్త:**

వృద్దులకు, వికలాంగులకు, ట్రాన్స్ జెండర్ వితంతువులకు తదితరులకు పంపిణీ చేయాల్సిన ఫింఛన్‌లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రాయదుర్గం ఎంపిడిఓ టి.అల్లాబకాష్ సంబంధిత అధికారులను హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జూలై 1వ తేదీ నుండి ఫించన్ పంపిణీ కార్యక్రమంపై మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫించన్ పంపిణీ సజావుగా జరగాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు, ఎంఆర్‌పిఎస్,గ్రామస్థాయి సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని సన్మానించిన ఆదిగానిపల్లి బిజెపి నాయకులు



ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులను సన్మానిస్తున్న ఆదిగానిపల్లి బిజెపినాయకులు

**కణేకల్లు, జూన్ 28 ప్రభాతవార్త:**

రాయదుర్గం శాసనసభ్యులైన కాలవ శ్రీనివాసులును మండల పరిధిలోని ఆదిగానిపల్లికి చెందిన బిజెపి నాయకులు శుక్రవారం రాయదుర్గం పట్టణంలోని సీతారామాంజినేయ కళ్యాణమంటపంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఎన్డీఏ కూటమిలో భాగంగా శాసనసభ్యులైన కాలవ శ్రీనివాసులను సన్మానించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కణేకల్లు బిజెపి అధ్యక్షులు మల్లయ్యచౌదరి, నాయకులు గుమ్మడి సత్యనారాయణ, బిజెపి మాజీ మండల అధ్యక్షులు ఆదిగానిపల్లి కురుబ తిప్పేస్వామి, బిజేవైఎం నాయకుడు తిప్పారెడ్డి, కత్రా హనుమంతు, రాజు, రమేష్, అరుణమ్మ, గోవర్ధన్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెట్లు నాటండి పర్యవరణాన్ని కాపాడండి





జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

**కంబదూరు, జూన్ 28 ప్రభాతవార్త**

చెట్లు నాటి పర్యవరణాన్ని కాపాడుదామని కంబదూరు మండల అధికారులు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ క ళాశాల ఆవరణంలో మండల అధికారులు చెట్లు నాటి నీరు పోశారు. ఈసందర్భంగా ఎంపిడిఓ, సల్మాన్‌రాజ్, ఎస్సై ఆంజినేయులు, ప్రిన్సిపాల్ శ్రీవల్లి మాట్లాడుతూ.. కార్బన్ దయాక్సైడ్ వల్ల గాలి కాలుష్యం ఎక్కువగా జరుగుతుండడంతో పర్యవరణాన్ని కాపాడాలంటే ప్రతి ఒక్కరు చెట్లు నాటాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుని ఎంపిక

**తాడిమర్రి, జూన్ 28 ప్రభాతవార్త**



అధ్యక్షున్ని సన్మానిస్తున్న దృశ్యం

తాడిమర్రి మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుల కమిటీని శుక్రవారం ఎంపిక చేసినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కన్యకా పరమేశ్వర ఆలయంలో జరిగిన సమావేశంలో నిచ్చనమెట్ల గంగాధర్ గుప్తాను మండల కమిటీ అధ్యక్షునిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ధర్మవరం అంబేటి సనత్, వేపాకుల సురేష్, గాదిమిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండలంలో ఆర్య వైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు జిల్లా కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షునిగా బండారు బుజ్జయ్య అలియాజ్ బండారు సుబ్బయ్య సెక్రెటరీగా గాదిమిశెట్టి చిల్లకొండాయిపల్లి రామకృష్ణయ్య, జాయింట్ సెక్రెటరీగా కె.మహేష్, ట్రెజరర్‌గా తాలంకి మోహన్, అడ్వైజర్‌గా డా.శంకరయ్యను మెంబర్స్‌గా కిష్టం సుబ్రహ్మణ్యం, గూండా పుల్లయ్య, వీరబొమ్మ నరేంద్ర, ముంటిమడుగు సాయి పవన్‌లు ఎంపిక కాగా, లీగల్ అడ్వైజర్‌గా బండారు వెంకటేష్‌లను ఎంపిక చేశారు. కమిటీని పలువురు సభ్యులు ఘనంగా సత్కరించి వారి చేత ప్రమాణస్వీకారాన్ని నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్షునిగా ఎంపికైన గంగాధర్ గుప్తా మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి ఆర్యవైశ్యుల సమస్యలను, గుడి సమస్యలను జిల్లా అధ్యక్షుని దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారాన్ని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముంటిమడుగు ప్రసాద్, వీరబ్రహ్మ వేణుగోపాల్, రేణిగుంట్ల సురేష్, వీరబ్రహ్మ మల్లికార్జున, ముంటిమడుగు రామకృష్ణయ్య, పలువురు ఆర్యవైశ్యులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన వైశ్య సోదరులు సమావేశంలో పాల్గొన్నారు.

**రాజగోపురానికి విరాళం :** రోడ్డు విస్తరణలో భాగంగా కన్యక పరమేశ్వరి ఆలయంకు ముందు భాగాన ఉన్న రాజగోపురాన్ని తొలగించడంతో ఆ స్థానంలో నూతన రాజగోపురాన్ని నిర్మించాలని ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రతిపాదించారు. అందుకుగాను స్పందించిన ఆర్యవైశ్యులు చిల్లకొండాయిపల్లి రామకృష్ణయ్య రూ.1.16లక్షలు, రేణిగుంట్ల సురేష్ 50వేలు, గంగాధర్‌గుప్తా 25వేలు, బిసి వెంకటరమణ కుమారుడు బిసి వెంకటేష్ రూ.20వేలు, అంబటి సనిత్ 5వేలు, రేపాకుల సురేష్ 5వేలు, గాదింశెట్టి శ్రీనివాసులు రూ.10వేలు, విరాళంగా ప్రకటించారు. విరాళం అందజేసిన దాతలకు ఆర్యవైశ్య సంఘం సలహా సభ్యులు వీరబ్రహ్మణ నగేష్ ఆర్యవైశ్యుల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు ముంటిమడుగు హర్ష, బాలాజీ మెడికల్స్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య పనులను పకడ్బంధీగా నిర్వహించండి

**- జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు**



**ఉరవకొండలోని 10వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు**

ఉరవకొండ, జూన్ 28 ప్రభాతవార్త

డయేరియా, మలేరియా ఇతరత్రా సీజినల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ప్రభాకర్‌రావు ఆదేశించారు. ఉరవకొండ పట్టణంలోని 10వ వార్డు రంగా వీధిలో శుక్రవారం ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ పర్యవేక్షణలో చేపట్టిన పారిశుధ్య



ఆరోగ్య, ఆశ, పంచాయతీ సిబ్బందికు పలు సూచనలు చేస్తున్న డీపీఓ ప్రభాకర్‌రావు

పనులను ఆయన తనిఖీ చేశారు. డీపీఓ ప్రభాకర్‌రావు దగ్గరుండి కాలనీలోని రోడ్లపై చెత్తచెదారాన్ని మురుగునీటి కాలువల్లో మురికిను శుభ్రం చేయించి దోమల వ్యాధి నివారణకు మిలాథిన్, బ్లీచింగ్ పౌడర్ చల్లించి అబేట్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. ఈ సందర్భంగా డీపీఓ ఆరోగ్య, ఆశ, సచివాలయ సిబ్బందికు పలు సూచనలు చేశారు. డయేరియా, మలేరియా ఇతరత్రా సీజినల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నందున ఎవరికి కేటాయించిన పనులను వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. పారిశుధ్య పనులను నిత్యం పర్యవేక్షిస్తూ దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టాలని, ప్రజలకు వ్యాధులపట్ల అవగాహన కల్పించాలని సూచించారు. అంతకుమందు డీపీఓ మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామాన్ని సందర్శించి 3 రోజుల ముందు డయేరియాతో మరణించిన కురుబ నాగేంద్ర కుటుంబాన్ని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.

## జూలై 1న ఉండబండ వీరభద్రస్వామి ఆలయ హుండీల లెక్కింపు

**-ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు**

ఉరవకొండ, జూన్ 28 ప్రభాతవార్త

విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలోని ఉండబండ వీరభద్రస్వామి ఆలయంలోని హుండీలను జూలై 1వ తేదీన ఉదయం 10 గంటల నుండి లెక్కించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో జరిగే హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు సాంప్రదాయ దుస్తులైన తెల్లపంచె, కండువాలు మాత్రమే ధరించి హాజరు కావాలని సూచించారు.

## ఆమిద్యాల, రాకెట్ల గ్రామాల్లో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలు

**- గ్రామాల్లో లార్వా సర్వే నిర్వహించిన వైద్య ఆరోగ్య సిబ్బంది**



**మలేరియా వ్యతిరేక మాసోత్సవ అవగాహన ర్యాలీ జరుగుతున్న దృశ్యం**

ఉరవకొండ, జూన్ 28 ప్రభాతవార్త

మలేరియా వ్యతిరేక మాసోతసవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని ఆమిద్యాల, రాకెట్ల గ్రామాల్లో పాఠశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీలు జరిగాయి. పరిసరాలతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని నినాదాలు చేస్తూ ప్రకార్డులను ప్రదర్శించారు. గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది లార్వా సర్వే నిర్వహించి ప్రజలకు సీజినల్ వ్యాధులపట్ల అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని తద్వారా దోమల లార్వా పుట్టుకను నిలువరించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డీ పి.చంద్రమౌళి, రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పావని, ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నముష్టూరు గ్రామంలో పకడ్బంధీగా డ్రై డే కార్యక్రమం

**- రెండో రోజు కొనసాగిన ఉచిత వైద్య శిబిరం**



**డ్రైడేలో భాగంగా నీటి తొట్టెలను పరిశీలిస్తున్న ఈఓఆర్‌డీ చంద్రమౌళి**

ఉరవకొండ, జూన్ 28 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పకడ్బందీగా జరిగింది. ఈఓఆర్‌డీ చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించి డ్రైడే కార్యక్రమాన్ని అమలు చేయించారు. ఇళ్లలోని నీటిని నిల్వ చేసుకునే తొట్టెలు, డ్రమ్ములను శుభ్రం చేయించి డ్రై డే ద్వారా చేకూరే ప్రయోజనాలను వివరించారు. కాగా గ్రామానికి చెందిన కురుబ నాగేంద్ర అనే వృద్ధుడు మూడు రోజుల క్రితం డయేరియాతో మరణించిన క్రమంలో పారిశుధ్య కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టారు. కాగా రెండవ రోజు కూడా గ్రామంలో రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం కొనసాగింది. పీహెచ్‌సీ వైద్యాధికారణి డాక్టర్ పావని రోగులను పరీక్షించి రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, సీహెచ్‌ఓ నాగరంగయ్య, సూపర్‌వైజర్ శేఖర్, పంచాయతీ కార్యదర్శి రమణకుమార్, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫీజుల దోపిడీని అరికట్టాలి




విద్యార్థి సంఘం నేతలు ధర్నా చేస్తున్న దృశ్యం

గుత్తి, జూన్ 28 ప్రభాతవార్త

ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంఇఒ కార్యాలయం ఎదుట ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటనాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌళిక వసతులు లేనప్పటికి విద్యార్థుల తల్లిదండ్రులతో వేలాది రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్, ధనూష్, మనోహర్, కిరణ్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## అనాధాశ్రమానికి నగదు వితరణ



ఆర్థిక సాయం అందచేస్తున్న దృశ్యం

గుత్తి, జూన్ 28 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలోని కొత్తూరులో వున్న స్వీట్ సేవియర్ చారిటబుల్‌ట్రస్ట్ అనాధాశ్రమానికి శుక్రవారం హరికృష్ణ అనే వ్యక్తి 12 వేల రూపాయల నగదును అందచేశారు. తన తండ్రి గోపాల్ జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తనవంతు కర్తవ్యంగా ఆశ్రమానికి చేయూతనందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో గోపాల్ కుమారుడు అరవింద్, కుటుంబసభ్యులు, అశ్రమ నిర్వాహకులు, పాల్గొన్నారు.

## రోడ్డుపై పేరుకుపోయిన మురుగు తొలగింపు

**- స్పందించిన మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి**



గ్యాస్ గోదాముపద్ద రోడ్డులో పేరుకుపోయిన మురుగును తొలగిస్తున్న పంచాయతీ కార్మికుడు

ఉరవకొండ, జూన్ 28 ప్రభాతవార్త

పట్టంణలోని ఇండేన్ గ్యాస్ గోదాముపద్ద రోడ్డుపై వర్షపునీరు చేరి పేరుకుపోయిన మురికిను తొలగించారు. శుక్రవారం వార్తలో దోమల వ్యాప్తితో ప్రజలు రోగాలబారిన పడుతున్నా పట్టించుకోరా..?! అన్న శీర్షికన స్థానిక కాంగ్రెస్ నాయకులు బ్యాళ్ళ శివప్రసాద్ మురుగును పరిశీలించిన వార్త ప్రచురిత ం కావడంతో మేజర్ గ్రామ పంచాయతీ స్పందించింది. పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ పారిశుద్ధ్య కార్మికులను పురమాయించి మురుగును తొలగించి వర్షపు నీటిని మురుగనీటి కాలువలోకి మళ్లింపజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ ప్రస్తుతం తాత్కాలిక ఉపశమన చర్యలు చేపట్టడం జరిగిందని త్వరలో జరిగే పంచాయతీ సాధారణ సమావేశంలో చర్చించి పెండింగ్‌లోవున్న 200 మీటర్ల సిమెంట్ రోడ్డు వేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు హిజ్రాలకు గాయాలు

**-మెరుగైన చికిత్సకై జిల్లా కేంద్రానికి తరలింపు**

ఉరవకొండ, జూన్ 28 ప్రభాతవార్త

పట్టణంలోని స్థానిక కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ముందు ప్రధాన రోడ్డులో శుక్రవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన శ్రేయ (మాజీ వాలంటీర్), స్వాతి అనే హిజ్రాలు ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురూ తమ ద్విచక్రవాహంలో క్లాకటవర్ వైపు వెళుతుండగా ట్రాఫిక్‌లో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు ఇరువురినీ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

## సచివాలయంలో సీయం, డిప్యూటీ సీయం, మినిస్టర్ ఫోటోలు పెట్టిన టీడీపీ నాయకులు



ఉరవకొండలోని సచివాలయం-3లో సీయం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఫోటోలు పెడుతున్న దృశ్యం

ఉరవకొండ, జూన్ 28 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలోగల 3వ సచివాలయంలో శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పోటోలు అతికించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫోటోలను పెట్టాలని ఇదివరకే ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వేల్పుల శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ పి.రాజేష్, కన్వీనర్ ప్రతాప్, నాయకులు నిమ్మల ప్రసాద్, గమ్ ప్రభాకర్, బెస్త రమేష్, బోయ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జాతీయ లోక్ అదాలత్

**-సద్వినియోగం చేసుకోవాలన్న మేజిస్ట్రేట్ డి.దుర్గాకళ్యాణి**

ఉరవకొండ, జూన్ 28 ప్రభాతవార్త

ఉరవకొండ మున్సిఫ్ ఫ్లస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జూనియర్ సివిల్ జడ్జీ, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మెన్ డి.దుర్గాకళ్యాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజీ కాదగిన సివిల్ కేసులు, క్రిమినల్ కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని సూచించారు.

# ఇలా ఉంటే నీరు పారేదెలా..?!

**- కూలిపోయి ఐదేళ్లైనా పీఏబీఆర్ రెగ్యులేటర్ పునః నిర్మాణం చేయని దుస్థితి - ప్రతిపాదనలతోనే సరి..నిధులు మంజూరు, పనులు ప్రారంభం ఎప్పుడో - పొలాలకు వెళ్లే ప్రధాన దారిసైతం మూసుకుపోయి అవస్థలు పడుతున్న రైతులు - జూలైలో నీటి విడుదలకు అడ్డంకిగా రెగ్యులేటర్‌వద్ద కూలిన షట్టర్లు, రాళ్లు**





**ఉరవకొండ మండలం మోపిడి గ్రామంవద్ద లింక్ ఛానల్ పీఏబీఆర్ రెగ్యులేటర్ కూలిపోయిన దృశ్యం, లింక్ ఛానల్‌వద్ద కూలిపోయిన రెగ్యులేటర్ కట్టడాలు**

ఉరవకొండ, జూన్ 28 ప్రభాతవార్త

మండల పరిధిలోని మోపిడి గ్రామంవద్ద తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్‌ఎల్‌సీ) పైగల కూలిపోయిన పీఏబీఆర్ రెగ్యులేటర్ పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఆలనా పాలనకు నోచుకోక, ఏడాదికొకసారి కనీస మరమ్మతులు కూడా జరుగకపోవడంతో క్రమేనా శిధిలమవుతూ వచ్చిన రెగ్యులేటర్ కట్టడాలు గత 2020 ఆగస్టు మొదటి వారంలో పూర్తిగా కుప్పకూలిపోయిన విషయం తెలిసిందే. రెగ్యులేటర్ కూలిపోయి దాదాపు నాలుగేళ్లు గడుస్తుండగా పునః నిర్మాణానికి నోచుకోకపోవడంతో కూలిపోయిన రెగ్యులేటర్ కాంక్రీట్ కట్టడాలు, షట్టర్లు, రాళ్లను కూడా తొలగించకపోవడంతో కాలువకు నీటిని విడుదల చేసినా పీఏబీఆర్‌కు చేరే అవకాశం లేదని స్పష్టమౌతోంది. సరైన సమయంలో వర్షాలు కురిస్తే ప్రతి ఏడాది తరహాలో జూలై రెండో వారంలో హెచ్‌ఎల్‌సీకు తుగంభద్ర జలాశయం నుండి నీరు విడుదల కానుండగా ఆ నీటిని ఎలా ముందుకు పంపుతారో అధికారులకే తెలియాలని స్థానిక రైతులు వాపోతున్నారు. రెగ్యులేటర్ కూలిపోయిన క్రమంలో మోపిడి లింక్ ఛానల్‌వద్ద నుండి నియంత్రణ లేకుండా నీటిని విడుదల చేస్తే బలహీనంగావున్న పీఏబీఆర్ లింక్ కాలువకు అనేకచోట్ల గండ్లుపడే అవకాశాలు లేకపోలేదని తెలుస్తోంది. అధికారులు మాత్రం నూతన రెగ్యులేటర్ నిర్మాణానికి 2020లోనే 3.3 కోట్ల రూపాయలు అవసరమవుతుందని అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా నేడు అంచనా వ్యయం రెట్టింపయ్యే పరిస్థితులు కనబడుతున్నాయి. వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నామన్న చెప్పుకొస్తున్న పాలకులు దాదాపు ఐదేళ్ళ క్రితం కూలిపోయిన రెగ్యులేటర్ పునః నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. హెచ్‌ఎల్‌సీ అధికారులకు సైతం కాలువకు నీరు విడుదలైన సమయంలో మాత్రమే ఈ రెగ్యులేటర్ గుర్తుకు వస్తుందని ఆ తరువాత దాని గూర్చి ఎవరూ మాట్లాడరని స్థానిక రైతులు వాపోతున్నారు.

## మెగా డిఎస్సీపై మొదటి సంతకం చేసిన చంద్రబాబునాయుడుకి ధన్యవాదాలు

**- తెలుగు ప్రొఫెషనల్ రింగ్ అసెంబ్లీ అధ్యక్షులు నాగరాజు**

మడకశిర టౌన్, జూన్ 28 ప్రభాతవార్త



తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అసెంబ్లీ అధ్యక్షులు నాగరాజు (ఫైల్ ఫోటో)

మడకశిర నియోజకవర్గం యువతి యువకుల తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు తెలుగు ప్రొఫెషనల్ రింగ్ అసెంబ్లీ అధ్యక్షులు నాగరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఎన్నో పోరాటాలు చేసిన, కనీసం చలనం లేకపోవడంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఒక్క డిఎస్సీ పోస్టును కూడా భర్తీ చేయలేదు. ఈ తరుణంలో అభ్యర్థులందరికీ అండగా ఉంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలు ముందు మాట ఇవ్వడం జరిగింది. ఆ మాట నిలబెట్టుకుంటూ నేడు 16,347 డిఎస్సీ పోస్టులు భర్తీకి మొదటి సంతకం చేయడం చాలా ఆనందకరం అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం, పెన్షన్ల పెంపకంపై మూడో సంతకం, అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ పైనాలుగో సంతకం, స్కిల్ సెన్సెస్ (గణన) పై ఐదవ సంతకం చేసిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తెలుగు యువత తరుపున తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అసెంబ్లీ అధ్యక్షులు నాగరాజు, ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

## అభివృద్ధి పనులపై అధికారులతో జడ్పిటిసి సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

అగళి, జూన్ 28 ప్రభాతవార్త

అధికారులతో జడ్పిటిసి ఉమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వెలుగు కార్యాలయానికి వెళ్లి ఏపి నాగరాజు, ఏపిఎం సురేష్ సూచనలతో ప్రత్యేకంగా ప్రశ్నించారు. ఈ సమీక్ష సమావేశానికి మండలంలోని యానిమేటర్లు హాజరయ్యారు. యానిమేటర్లు ఎలాంటి పక్షపాతం చూపకుండా మహిళలకు న్యాయం చేయాలన్నారు. కొందరు వెలుగు సిబ్బంది ఉద్యోగులు ఒక పార్టీ వైపు మొగ్గ చూపారని



వెలుగు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

అలాంటి పద్దతులు మానుకుని నిష్పక్షపాతంగా, పార్టీలకు అతీతంగా సేవ చేయాల్సిన అవసరం ఉందని, అలా సేవలు అందించకుంటే చర్యలు తప్పకుండా తీసుకోవడంతోపాటు ఉన్నతాధికారుల ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి బంధుప్రీతి, స్నేహం లాంటి విషయాలకు ఇక్కడ ఆస్కారం లేకుండా ఉంటుందని, ఒక పార్టీకి వంత పాడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎంపిడిఓ రాజేంద్ర ప్రసాద్‌తోపాటు ఏపిఓ సురేష్‌తో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. గత వైఎస్ఆర్ సిపి పాలనలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఏకపక్షంగా వ్యవహరించారని, అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. దీంతోపాటు ఉపాధిలో అవినీతికి పాల్పడిన ఉద్యోగులను వదలమన్నారు. వెలుగు కార్యాలయంపై కూడా ప్రత్యేకమైన దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్‌తోపాటు కన్వీనర్ కుమారస్వామి, నాయకులు శివకుమార్, తిప్పేస్వామి, బసవరాజు, నరసింహప్ప, కెంచు యాదవ్, జయరామ్, రాజన్న, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీకి 7.5 లక్షల ఆదాయం

అమరాపురం, జూన్ 28 ప్రభాతవార్త

అమరాపురం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో చెరువులో చేపల పంపకం, దినసరి సంత మార్కెట్‌ను గ్రామపంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎస్ జోగేంద్ర అనే వ్యక్తి 6.90 లక్షలతో చెరువులో చేపల పెంపకం వేలంపాట దక్కించుకున్నారు. అదేవిధంగా విఆర్ మంజునాథ్ అనే వ్యక్తి దినసరి సంత మార్కెట్‌కు సంబంధించి 60,100 రూపాయలకు వేలం దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వేలంపాట ద్వారా గ్రామపంచాయతీకి 7.5 లక్షల రూపాయల ఆదాయం వచ్చింది.

## పావగడలో కట్టడ కార్మికుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా



**తహశీల్దారుకు వినతిపత్రాన్ని అందిస్తున్న కట్టడ కార్మికుల సమన్వయ సమితి నాయకులు**

పావగడ, జూన్ 28 ప్రభాతవార్త

పావగడలో కట్టడ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కట్టడ కార్మికుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. స్థానిక పిడబ్ల్యూడి గెస్ట్ హౌస్ నుంచి ప్రారంభమై తహశీల్దార్ కార్యాలయం వరకు చేరుకొని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి కట్టడ కార్మికుల సమన్వయ సమితి నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కట్టడ కార్మిక విరోధి నీతి నియమాలను అనుసరిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నదని వారికి లభించాల్సిన మూలబూత సౌకర్యాలను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కట్టడ కార్మికులకు అవసరం లేని కిట్టులను క్యాలెండర్లను తదితర వాటిని పంపిణీ చేస్తూ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. ఇంతకు మునుపు మాదిరిగానే విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా అనేక డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడి వినతిపత్రాన్ని తహశీల్దారు వరదరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రామాంజినప్ప, విహెచ్ రామాంజి, మమత, నాగరాజు, మద్దిలేటప్ప, ఏఐటియుసి రామకృష్ణ, గౌడ రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా అందించాలి- సిడిపిఓ అనురాధ



**రికార్డులను తనిఖీ చేస్తున్న సిడిపిఓ అనురాధ**

గోరంట్ల జూన్ 28 ప్రభాతవార్త

మండలంలోని సామల పల్లి మోటారుపల్లి, కాటేపల్లి, సోమందేపల్లి, మండలం పత్తికుంటపల్లి, వెలిదడకల, అంగన్వాడీ కేంద్రాలు సిడిపిఓ అనురాధమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి సరఫరా అయ్యే పౌష్టికాహారం నిల్వలు పరిశీలించారు. పొడిగా వుండే ప్రదేశంలో ఆహారపదార్థాలు నిల్లచేయాలని కార్యకర్తలకు సూచించారు. లబ్దిదారులను పిలిపించి మీటింగ్ ఏర్పాటు చేసారు. సిడిసిఓ అనురాధమ్మ లబ్దిదారులతో మాట్లాడుతూ గర్భిణీ అని నిర్ధారణ అయన వెంటనే అంగన్వాడీ కేంద్రంలో నమోదు చేసుకోవాలని అంతే బాధ్యతగా పౌష్టికాహారం అంగన్వాడీ కేంద్రం నుండి తీసుకెళ్లిపొడి ప్రదేశంలో నిల్వ చేసుకుని తల్లి రోజూ క్రమం తప్పకుండా తీసుకోవాలని అప్పుడే పౌష్టికాహారలోపం తగ్గి తల్లిబిడ్డ ఆరోగ్యంగా వుంటారని తెలియజేశారు. అలాగే పరిసరాలు పరిశుభ్రతంగా ఉంచుకొని సీజనల్ వ్యాధులు పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ అనురాధమ్మతో పాటు గోరంట్ల సూపర్వైజర్ రజిత సోమందెపల్లి సూపర్వైజర్ శోభారాణి ఉన్నారు.

## చెట్లు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం

పుట్టపర్తి రూరల్ జూన్ 28 ప్రభాతవార్త

పుట్టపర్తి నియోజకవర్గంలో విరివిరిగా చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుదామని బిజెపి నాయకులు శుక్రవారం శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాన్ కార్యక్రమంలో భాగంగా అమ్మపేరుతో చెట్లునాటుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి మండల పరిదిలోని వెంగళమ్మచెరువు, పంచాయితీ పరిధిలోని కంబాలపర్తి గ్రామంలో బూత్ నెంబర్ 82 లో చెట్లును నాటారు. ఈ చెట్లును సంరక్షించుకోవడం కూడా మన బాధ్యతేనని వారు గ్రామస్తులకు యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బిజెపి నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా బిజెపి ఎస్సి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గుడిసె దేవానంద్ ఎస్సి మోర్చా జిల్లా అధ్యక్షులు ఆనంద్ బిజెపి ముఖ్యనేతలు కొండమరాజు, హరికృష్ణ గౌడ్, జ్యోతిప్రసాద్, గంగిశెట్టి ఆవుల విష్ణు ,వెంకట శివ చంద్రశేఖర్ ,వేమన్న తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న బిజెపి నాయకులు

# కత్తి నాటిన చెట్లు కళకళ..!

యాడికి(తాడిపత్రి), జూన్ 28,ప్రభాతవార్త: వృక్షోరక్షతి రక్షిత: అనే నానుడిని త్రికరణ శుద్ధిగా నమ్మిన అప్పటి యాడికి ఎస్సై కత్తి శ్రీనివాసులు నాటిన మొక్కలు నేడు చెట్లుగా ఎదిగి కళకళలాడు తున్నాయి. నూతన పోలీసు స్టేషన్ నుంచి ప్రధాన రహదారికి మధ్యన ఉన్న సీసీ రోడ్డుకు ఇరువైపులా 2017లో పోలీసు సిబ్బందితో పెద్ద ఎత్తున మొక్కలు నాటించి సంరక్షిం చారు. ఏడాదిన్నర పాటు ప్రత్యేక శ్రద్ధతో వాటిని కాపాడటంతో నేడు దారి పొడవునా పచ్చదనాన్ని, చల్లదనాన్ని ఇచ్చి ఆహ్లాదాన్ని పంచు తున్నాయి. ఆ రోజు నుంచి నేటి వరకు వీటిని గమనిస్తున్న స్థానికులు 'కత్తి నాటిన చెట్లు కళకళలాడుతున్నాయని' ప్రశంసలు కురిపిస్తున్నారు. అంగ రంగ వైభవంగా జరిగిన యాడికి పెద్దమ్మ జాతరను విజయ వంతంగా నడిపిన ఆయన ఇక్కడి నుంచి సీఐగా పదోన్నతితో బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం పీలేరు నియోజకవర్గంలోని కల్లూరు స్టేషన్‌లో విధులు నిర్వహి స్తున్నారు.


2017లో ఎస్సై కత్తి శ్రీనివాసులు నాటించిన మొక్కలు


రోడ్డుకిరువైపులా నేడు కళకళాడుతున్న చెట్లు

# స్వచ్ఛంధంగా రక్తదానం చేయండి - ప్రాణదాతలు కండి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 28 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ డాక్టర్ వినోద్‌కుమార్ గత కొంతకాలంగా రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌కు రక్తదాన శిబిరాల నిర్వహణలో సహకరించిన వారికి కలెక్టర్ వినోద్‌కుమార్ కలెక్టర్ కార్యాలయంలో జ్ఞాపికలను అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ధర్మవరం శాంతినగర్‌కు చెందిన చంద్రశేఖర్ రక్త బంధం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, రక్తదాతలను ప్రోత్సహిస్తున్నందుకు కలెక్టర్ వారిని అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మీరు మీ సంస్థ రక్తబంధం ఆర్గనైజేషన్ రెడ్ క్రాస్ సంస్థతో కలిసి రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి ఆపదలో వున్న వారిని ఆదుకోవడంలో సహకరించడం పట్ల ఆయను అభినందించారు. అనంతరం రక్త బంధం ఆర్గనైజేషన్ సభ్యులు చంద్రశేఖర్ మాటాడుతూ దాదాపు నాలుగు సంవత్సరాల నుండి మా సంస్థ రక్తదాతలను ప్రోత్సహిస్తున్నందున జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ తనను సన్మానిం చినందుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాపు రామచంద్రారెడ్డి, ఇండి యన్ రెడ్ క్రాస్ సొసైటీ స భ్యులు, తదితరులు పాల్గొ న్నారు.


జ్ఞాపిక అందచేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

# ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న కార్పోరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలపైన చర్యలు తీసుకోవాలి - పిఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు

అనంతపురం న్యూటౌన్, జూన్ 28 ప్రభాతవార్త

అనంతపురంలో శుక్రవారం రాష్ట్ర కమిటీ సమావేశం కామ్రేడ్ అబ్దుల్ ఆలం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన టువంటి పిఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఆర్.సతీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నటువంటి కార్పోరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అబ్దుల్ ఆలం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శివ మాట్లాడుతూ.. కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలు నిబంధనలు విరుద్ధంగా లక్షల ఫీజులు వసూలు చేస్తూ యూనిఫాం పుస్తకాలు పేరుతో వ్యాపారం చేస్తున్నారని తక్షణమే వీటిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మీ సమావేశంలో నూతన విద్యా విధానాన్ని మార్పులు చేయాలని, విద్యార్థులు అన్ని దశల్లోను ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టి, విద్య పూర్తయ్యాక ఉద్యోగం కల్పించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని తద్వారా నిరుద్యోగాని అరికట్టాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రతిభ భారతి, రాష్ట్ర సహాయ ప్రసన్నకుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు రవికు మార్, జీవన్ కుమార్, వీరిని ఎన్నుకోవడం జరిగింది. నాయకులు వలి, ఆఫ్రీద్, మహిళా నాయకులు మౌనిక, వసంత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పిఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ నేతలు

## క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు

అనంతపురం కలెక్టరేట్, జూన్ 28 ప్రభాతవార్త

జిల్లా నగరపాలక సంస్థ కార్పోరేషన్‌లోని సమావేశ భవనంలో శుక్ర వారం కమీష నర్ మేఘస్వరూప్ ఆదేశాల మేరకు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎస్‌బి విష్ణుమూర్తి ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహి ంచారు. మున్సిపల్ ఉద్యోగులు, మహిళా కార్మికు లకు వీటిపైన అవగాహన కల్పిస్తూ వీల్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, అవగాహన సదస్సుకు అందరూ హాజరు అయ్యే విధంగా వారికి తెలియచేసి కార్యక్ర మాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. అనంతరం వీరికి జూన్ 30వతేదీ ఉదయం 9 గంటల నుండి ఉచిత నిర్ధారణ పరీక్షలు, అవ గాహన ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటిని అందరూ సద్వినియోగం చేసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎస్‌బి విష్ణు మూర్తి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు పిటి పద్మ, ఇన్నర్‌వీల్ క్లబ్ పాస్ట్ ప్రెసి డెంట్, చైర్మన్ శ్రీవల్లి, ఎఎస్ఒ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎస్‌బి విష్ణుమూర్తి

## మరమ్మతు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

డి.హీరేహాళ్, జూన్ 28 ప్రభాతవార్త:

తుంగభద్ర హైలెవెల్ కెనాల్ అడ్వికేట్ మరమ్మత్తు పనులను రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. శుక్రవారం డి.హీరేహాళ్ మండల పరిధిలోని తుంగభద్ర ఎగువ కాలువ అక్విడేట్ వర్షం వరదకు దెబ్బ తినడంతో హెచ్ఎల్‌సి అధికారులు రూ. 40లక్షలతో చేపట్టిన మరమ్మత్తు పనులు ఎమ్మెల్యే తన అనుచరులతో కలిసి తిలకిం చారు. మండల పరిధిలోని హొసగుడ్డం మీదుగా వేదావతి హగరికి వెళ్లే వాగుకుపై అక్విడేట్ హెచ్ఎల్‌సి కాలువ నిర్మాణం జరిగింది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కర్ణాటక ప్రాంతం నుండి ఈ వాగుకు వరద ఉధృతి అధికం కావడంతో ఈ క్విడేట్ పూర్తిస్థాయిలో దెబ్బతింది. నాగలాపురం -చెర్లోపల్లి రైతులు ఈ విషయాన్ని ఎమ్మెలల్యే దృష్టికి తీసుకుపోవడంతో ఆయన సంబంధిత అధికారులతో చర్చించి మరమ్మత్తు పనులకు శ్రీకారం చుట్టేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట చెర్లోపల్లి ఎంపిటిసి మొండి మల్లికార్జున, మాజీ ఎంపిటిసి గుండ్లపల్లి వెంకటేశులు, తెదేపా శ్రేణులు వేమారెడ్డి, మల్లికార్జునరెడ్డి, మల్లికార్జునగౌడ్, తెదేపా మాజీ కన్వీనర్ రాజశేకర్, శ్రీరాములు, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.


హెచెఎల్‌సి మరమ్మత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ

## పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

అనంతపురం న్యూటౌన్, జూన్ 28 ప్రభాతవార్త

గత నెల 24 నుంచి జూన్ 10వ తేది వరకు జరిగిన పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈ నెల 26వ తేది విడుదల అయినట్లు డిఈఓ బి.వరలక్ష్మి, ఏసి గోవింద నాయక్ శుక్రవారం ఒక ప్రకట నలో తెలిపారు. ఈ పరీక్షలకు 7784 మంది విద్యార్థులు హాజరు కాగ 4854 మంది విద్యార్థులు ఉత్తీర్ణత కావడం జరిగింది. ప్రభుత్వ పరీక్షల సంచాలకులకు ఉత్తర్వుల మేరకు మే 2024లో నిర్వహించిన 10వ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి రీకౌంటింగ్ కొరకు రూ.500లు, రీవెరిఫికేషన్ ద్వారా జవాబు పత్రం నకలు కావాలసినవారు రూ.1000లను ఈ నెల 27వ తేది నుంచి ఆగస్టు ఒకటవ తేది వరకు ప్రధానోపాధ్యాయుల లాగ్ ఇన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవా లన్నా రు. ఈ విషయాన్ని అందరూ గమనించాలని కోరారు.

## అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలి

అనంతపురం న్యూటౌన్, జూన్ 28 ప్రభాతవార్త

పని చేసే చోట లైంగిక వేదింపులు (నివారణ, నిషేదం, దిగ్గుపాటు) చట్టం-2013 అమలులో భాగంగా జిల్లా కలెక్టర్ అన్ని మండలాల తహశీల్దార్లను ఈ చట్టం ప్రకారం నోడల్ అధికారులు నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. 10 మంది కంటే ఎక్కువ ఉద్యోగులు (రెగ్యులర్/కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్) ఉన్న అన్ని ప్రభుత్వ/ ప్రభుత్వేతర కార్యాలయాలలో, కర్మాగారాలలో, స్వయం ఉపాధి ప్రదేశాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికార అధికారిణి బిఎన్.శ్రీదేవి తెలియజేశారు. పని ప్రదేశంలో లైంగిక వేదింపులకు గురైన మహిళలు పని చేసే చోట లైంగిక వేదింపులు (నివారణ, నిషేధం, దిద్దుబాటు) చట్టం-2013 ప్రకారం కలెక్టర్ నోడల్ అధికారులు నియమించిన తహశీల్దారులకు ఫిర్యాదు చేయవచ్చు అని, తహశీల్దార్లు సంబంధిత ఫిర్యాదును స్థానిక/ అంతర్గత ఫిర్యాదుల కమిటీకి తగు చర్యల నిమిత్తం పంపుతారని డాక్టర్ బిఎన్.శ్రీదేవి, ప్రాజెక్ట డైరెక్టర్లు, జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ, అనంతపురం తెలియజేశారు.

## పరిసరాలను పరిశుభ్రతోనే ఆనారోగ్యలకు దూరం కావచ్చు

### ఇటుకలపల్లి సర్పంచ్ భాస్కర్‌రెడ్డి,కార్యదర్శి సర్దార్‌వలి.

అనంతపురం రూరల్, జూన్28 ప్రభాతవార్త:

గ్రామాలలో నివసించే ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రతోనే ఆనారోగ్యలకు దూ రంగా ఉండి ఆరోగ్యంగా జీవించవచ్చాని ?ఇటుకలపల్లి గ్రామ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి సర్దార్ వలి పేర్కొ న్నారు. శుక్రవారం అనంత రూరల్ మండ లం ఇటుకలపల్లి పంచాయితీలో ఫ్రై డే కార్య క్రమం నిర్వహించి పంచాయితీలోని వీధు లోని డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నివసించే ప్రజలందరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కుంటే మనకు ఎటువంటి రోగాలు రావన్నారు. ప్రజలందరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యమును కాపాడుకోవాలని వారు ప్రజలకు తెలియ జేశారు.సీజనల్ వ్యాధులు నిర్మూలన కోసం గ్రామ పంచా యితీలలో డ్రైనేజీ కాలువలు శుభ్రం చేసి ప్రతి రోజు గ్రామంలోని వీధుల్లో బ్లీసింగ్ పౌండర్‌తో పాటు పాగింగ్, శానిటేషన్ పనులు నిర్వహించాలని పంచాయితీ కార్మికులకు తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


పరిసరాల పరిశుభ్రతను పరిశీలిస్తున్న సర్పంచ్ ,పంచాయితీ కార్యదర్శి.

## ఘనంగా పదవి విరమణ సభ

అనంతపురం, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సమావేశభవనంలో డియం అండ్ హెచ్ఓ డాక్టర్ ఈబి దేవి అధ్యక్షతన, ఇదే కార్యాలయంలో డెమోవిభాగ ంలో పని చేస్తూ ఈనెల 30వ తేదిన పదవీ విరమణ చేయబోతున్న లేపాక్షి ఉమాపతి పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబి.దేవి మాట్లాడుతూ.. ఉమాపతి వైద్య ఆరోగ్యశాఖలో గత 35 సంవత్సరాలుగా పని చేసిన రపతి చోట ఎంతో అంకిత భ్రావంతో పని చేసిన వైద్య శాఖకు మంచి పేరు రావడానికి ప్రయత్నం చేశారని తెలిపారు. అంతేకాక ఏ పని అప్పగించినా అంకిత భ్రావంతో, సమయపాలనతో పని చేసే వారని తెలిపారు. ఉమాపతి శేష జీవితం ఆయురారోగ్యాలతో దేవుడు ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా.సుజాత, డాక్టర్ యుగంధర్, డా.అనుపమ, డా.రవి శంకర్, డా సైదన్న, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజ మనోహర్‌రావు, ఎస్ఓ మహ్మద్ రఫి, ఉప డెమో త్యాగరాజ్, గంగాధర్, సూపరింటెండెంట్, వి.విజయ భాస్కర్‌రెడ్డి, సురేష్, కమలాకర్‌రాజు, పవన్ అసోషియేషన్ నాయకులు, మాధవ,చంద్రమోహన్, లక్ష్మన్న, షఫీ, శ్రీధర్‌బాబు, లక్ష్మీనారాయణ, సాంబ, శివమ్మ, మొదలగు వారు పాల్గొన్నారు.


పదవీ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

## నేడు సంగీత విభావరి

తాడిపత్రిఅర్బన్, జూన్ 28 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని శ్రీమార్కండేయస్వామి ఆలయం ప్రాంగణంలో శనివారం సాయంత్రం 6 గంటలకు సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శ్రీస్నేహభారతి సంగీత శిక్షణాలయం నిర్వాహకులు మహేష్‌స్వామి, శ్రీబహుత్తమ పద్మశాలీయ సంఘం పట్టణ అధ్యక్షులు గద్దం గణేష్‌లు తెలిపారు. గానగంధర్వుడు ఎస్‌పి బాలసుబ్రమణ్యం 78వ జయంతి సందర్భంగా ఎస్‌పి బాలు మ్యూజిక్ అకాడమి సాంస్కృతిక సంస్థ, తాడిపత్రి శ్రీస్నేహభారతి సంగీత శిక్షణాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా పల్లవించవా - నాగొంతులో స్వరార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. సంగీత ప్రియులు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# ఇంటి వద్దకే ఎన్టీఆర్ భరోసా పింఛన్ - ఎంపిడిఓ బివి.రమణ

శింగనమల, జూన్ 28 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కొరకు పేద, బలహీన వర్గాలు, ముఖ్యంగా వృద్ధులు, అస్వస్థత, వితంతువులు, వారి కష్టాలను తీర్చడానికి పెన్షన్ మొత్తాన్ని పెంచడం జరిగిందని, జులై 1వ తేదిన ఎన్టీఆర్ భరసా పెన్షన్, పింఛన్ దారుల ఇంటి వద్దకే వచ్చి సచివాలయ ఉద్యోగులు అందజేస్తారని ఎంపిడిఓ బివి.రమణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఆయన సచివాలయ ఉద్యోగులు, పంచాయితీ కార్యదర్శిలతో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీపై సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. జులై 1వ తేదిన ఇంటింటికీ వెళ్లి పంచాయితీ కార్యదర్శిలు, వారి సిబ్బంది మండల వ్యాప్తంగా 6497 మంది పింఛన్ దారులకు మొత్తం 4,47, 01500 రూపాయలు పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రతిపెన్షన్ దారు డికి రూ.7వేలు అందివ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న పెన్షన్‌ను 3 నుంచి 4వేలకు పెంచడం జరుగుతుందని, వికలాంగులు, బహు వైకల్యాలు కలిగిన, కుష్టు వ్యాధిగ్రస్తులకు పెన్షన్‌ను 3 నుంచి 6కు పెంచినట్లు తెలిపారు. పూర్తి వికలాంగులకు 5 నుంచి 15వేలకు పెన్షన్‌ను పెంచినట్లు తెలి పారు. దీర్ఘకాలిక వ్యాధు లతో బాధపడుతున్న వ్యక్తు లకు పెన్షన్ మొత్తాన్ని 5 నుం చి 10వేలకు పెంపు. పెన్షన్ పంపిణీ జులై 1 నుంచి ఉదయం 6 గంటలకు నుంచి ప్రారంబి ంచి, గ్రామ/వార్డు సచివాల యాల వారి ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ఏ ఒక్క పెన్షన్ దారుడు సచివా లయ ంకుగాని, ఇతర కార్యాలయాలకు గాని వెళ్లాల్సిన పని లేదన్నారు. పెన్షన్ పంపిణీకి సంబంధించి క్షేత్రస్థా యిలో జిల్లాయ ంత్రాంగం ద్వారా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రతి 50 మంది పెన్షన్ దారులకు ఒక సిబ్బందిని నియమించడం జరిగిం దని, నియమించిన సిబ్బంది వారికి కేటాయించిన పెన్షన్ దారులకు పెన్షన్ మొత్తం అందజేస్తారన్నారు. అధి కారులు పెన్షన్ల పంపిణీ అత్యంత జాగ్రత్తగా చేపట్టి, అర్హత కలిగిన పెన్షన్ దారునికి పెన్షన్ అందజేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమలో తహశీల్దారు శోభన్‌బాబు, వెలుగు ఏపి ఎం నారాయణస్వామి, ఈఓఆర్డి మురళీకృష్ణ, మండల పరిధిలోని సచి వాలయ ఉద్యోగులు, పంచాయితీ కార్యదర్శిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఓ బివి.రమణ

# వార్డెన్ అప్పు చేస్తేనే...హాస్టల్ విద్యార్థులకు భోజనం...!

## దాదాపు తొమ్మిది నెలలుగా డైట్ బిల్లులు పెండింగ్ - గత ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణం

అనంతపురం న్యూటౌన్, జూన్ 28 ప్రభాతవార్త

ప్రభుత్వ హాస్టల్స్‌లో చదువుతున్న పేద విద్యార్థులకు భోజనం పెట్టాలంటే వార్డెన్లు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. డైట్ బిల్లులను గత ప్రభుత్వం మంజూరు చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా దాదాపు తొమ్మిది నెలలుగా బిల్లులు రాక వార్డెన్లు నానా ఇబ్బందులు పడుతున్నారు.

అనంతపురం జిల్లాలో ఎస్సీ-51, ఎస్టీ-5, బీసీ-55, హాస్టల్స్ ఉన్నాయి. ఎస్సీ హాస్టల్స్‌కు గత ఎడాది సెప్టెంబర్ నుంచి ,ఎస్టీ హాస్టల్స్‌కు డిసెంబర్ నుంచి, బీసీ హాస్టల్స్‌లో అనంతపురం, కళ్యాణ దుర్గం డివిజన్లకు ఈ ఎడాది జనవరి నుంచి, తాడిపత్రి డివిజన్‌కు గత ఎడాది అక్టోబర్ నుంచి జూన్ నెల వరకు డైట్ బిల్లులు మంజూరు కాలేదు. కొన్ని నెలలకు బడ్జెట్ మంజూరు చేశారు. కానీ బిల్లులు మాత్రం మంజూరు కాలేదు. ప్రతి నెల సక్రమంగా బిల్లులు చెల్లించాల్సిన ప్రభుత్వానిదే. కానీ గత ప్రభుత్వం తన బాధ్యతను మరిచి తొమ్మిది నెలలుగా డైట్ బిల్లులు మంజూరు చేయకపోవడం వలన విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెట్టడానికి వార్డెన్లు అప్పులు పాలు అవుతున్నారు. కొందరు వార్డెన్లు తమకు వచ్చే జీతాన్ని కూడా హాస్టల్ విద్యార్థుల డైట్ కోసమే ఖర్చు చేస్తుండటం గమనార్హం. హాస్టల్ విద్యార్థుల డైట్ కోసం వడ్డీలతో తెచ్చిన అప్పులు కూడా రోజు రోజు పెరుగుతున్నాయి. ఈ విషయాలు ఆయా సంక్షేమ శాఖల ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ పై నుంచి రానప్పుడు తామేమి చేస్తా మని తప్పించుకుంటున్నా రు. ఈ పరిస్థితి ఒక్క అనం తపురం జిల్లాలోనే కాదు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వలనే తమకు ఈ పరిస్థితి వచ్చిందని పలువురు వార్డెన్లు ఆరో పిస్తున్నారు. రాష్ట్రంలో తా జాగా కొత్త ప్రభుత్వం ఏర్పా టైంది. కొత్త ప్రభుత్వం అ యినా స్పందించి పెండింగ్‌లో ఉన్న డైట్ బి ల్లులను వెంటనే మంజూరు చేయాలని పలువురు వార్డెన్లు కోరుతున్నారు. అయితే దీనిపై కొత్త ప్రభుత్వం ఏ విధంగా స్పంది స్తుందన్నది వేచి చూడాల్సిందే.

**.డైట్ బిల్లులు పెండింగ్ ఉన్న మాట వాస్తవమేః ఎస్సీ వేల్ఫేర్ జేడీ, బీసీ వేల్ఫేర్ ఇన్‌ఛార్జ్ డీడీ మదుసూధన్‌రావు :** అనంతపురం జిల్లాలో ఎస్సీ, బీసీ హాస్టల్స్‌కు గత కొన్ని నెలలుగా డైట్ బిల్లులు మంజూరు కాలేదన్న మాట వాస్తవమే. దాదాపు ఒక వారంలో అన్ని బిల్లులు మంజూరు చేస్తాము.


భోజనం తింటున్న హాస్టల్ విద్యార్థులు

# ఉన్నత సమాజాన్ని నిర్మించాలి

## - విద్యా వ్యవస్థలోని అన్ని వ్యవస్థలను ఒక గొడుగు కిందకు తీసుకురావాలి - సిపిఎస్‌ను రద్దు చేస్తూ సిపిఎస్ ఉద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి - ఫోర్టో నేతలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 28 ప్రభాతవార్త

అంతర్జాలంలో ఫోర్టో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మన్ కరణం హరికృష్ణ సెక్రెటరీ జనరల్ అంకాల కొండయ్య, రాష్ట్ర కో చైర్మన్ వెంకటరెడ్డి, అధికార ప్రతినిధులు బోనెల రమేష్, మాగంటి శ్రీ నివసరావు మాట్లాడుతూ.. ఉన్నత సమాజాన్ని నిర్మించాలంటే విద్యా వ్యవస్థలోని అన్ని వ్యవస్థలను ఒక గొడుగు కిందకు తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సిపిఎస్‌ను రద్దు చేస్తూ సిపిఎస్ ఉద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. పంచాయితీరాజ్ పరిధిలోని పాఠశాలలను, మండల, జిల్లా పరిషత్ యాజమాన్యాంలోకి 84 జీవో నెంబర్‌ను రద్దు చేసి, నగర, మున్సిపాలిటీ, కార్పోరేషన్ పరిధిలోని పాఠశాలలను మున్సిపల్ యాజమాన్య పరిధిలోకి విలీనం చేయాలని విజ ఒప్తి చేశారు. అదే విధంగా విద్యా వ్యవస్థ నిర్వీర్యానికి కారణమైన 117 జీఓను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. అదే విధంగా పలు డిమాండ్లను చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలన్నారు. కెజిబివి సిఆర్‌డిలకు ఎంటిఎస్ అన్వర్తింపజేయాలని విన్నవించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వసంతరావు, శేషఫణి, కేశినేని ప్రభాకర్‌రావు, గోపాలప్ప, దొడ్డా ఉమా మహేశ్వరరావు, కుమార్, అమర్‌నాథ్, ఆదిశేషయ్య, వేణుగోపాల్, ఏపి సిపిఎస్ ఇఎ రామన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను పరిష్కరించటం ప్రతిఒక్కరి బాధ్యత

## - రామగిరి ఎగువతండా ప్రజలకు మినరల్ వాటర్ సరఫరా చేయించిన గుమ్మనూరు ఈశ్వర్

పామిడి, జూన్ 28 ప్రభాతవార్త

ప్రజల సమస్యలను పరిష్కరించటం ప్రతిఒక్కరి బాధ్యత అని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు టిడిపి యువనాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. మండల పరిదిలోని రామగిరి ఎగువ తండా గ్రామంలో శుక్రవారం టిడిపి యువ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ ప్రజలకు ట్యాంకర్ల ద్వార మినరల్ వాటర్‌ను సరఫరా చేయించారు. కలుషిత నీరు సరఫరా కావటం కారణంగా మేమంతా రోగాల బారిన పడుతూ సతమతం అవుతున్నామని అందువల్ల గ్రాగునీటిని సరఫరా చేయంచాలని గత రెండ్రోజుల క్రితం గ్రామంలో పర్యటించిన గుమ్మనూరు ఈశ్వర్‌కు ప్రజలు విన్నవించగా స్పందించిన ఆయన ఇక్కడ ట్యాంకర్లను శుద్ధి చేసి పైప్‌లైన్ ద్వార త్రాగునీరు సరఫరా జరిగే వరకూ మీకు వినరల్ వాటర్‌ను సరఫరా చేస్తామని హామి ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే. గుమ్మనూరు ఈశ్వర్ పంపించిన ట్యాంకర్లు గ్రామానికి చేరుకోగానే త్రాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలంతా ట్యాంకర్లను చుట్టుముట్టారు. కలుషితనీరు సరఫరాతో మేమంతా రోగాల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటూ త్రాగునీటిని సరఫరా చేయాలని గుమ్మ నూరు ఈశ్వర్‌ను కోరిన వెంటనే ట్యాంకర్లతో మినరల్ వాటర్‌ను సరఫరా చేయించటం మాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని హర్షం వ్యక్తం చేసిన ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలి యజేశారు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఆశించకుండా ఆపదలో ఉన్న వారిని ఆదుకు న్నప్పుడే మా నవ జన్మకు సార్ధకం ఏర్పడు తుం దని ప్రతి నీటిబొట్టును వృధా చేయ వద్దని ప్రజలకు తెలియజేసిన గుమ్మ నూరు ఈశ్వర్ త్రాగునీటిని అందించటం మహా పుణ్యకార్యమని వెల్లడించారు.


రామగిరి ఎగువతండా ప్రజలకు మినరల్ వాటర్ సరఫరా చేస్తున్న దృశ్యం.

## ఫించన్ల పంపిణీపై సమావేశం


అవగాహన కల్పిస్తున్న అధికారులు


హాజరైన సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు

పుట్లూరు, జూన్ 28 ప్రభాతవార్త

జూలై 1వతేదీన ఫించన్ల పంపిణీ విషయంపై మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ దస్తగిరి, తహశీల్దార్ మల్లికార్జునస్వామి మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో ఫించన్ పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయం సిబ్బంది చేత ఇంటింటికి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఫించన్ల పంపిణీ సజావుగా నిర్వహించేందుకు సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను పర్యవేక్షణ చేయడం కోసం ఆయా పంచాయతీలకు మండల స్థాయి అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ఆయా అధికారులు తమకు కేటాయించిన సంబంధిత సచివాలయం సిబ్బందితో ముందుగానే సమావేశమై ఫించన్ పంపిణీ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుని జూలై 2వతేదీలోపు ఫించన్ల పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## వారపు సంత వేలం పాట

నల్లచెరువు, జూన్ 28, ప్రభాతవార్త:

మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వారపు సంత వేలం పాటను శుక్రవా రం గ్రామ సచివాలయం లో-1లో ఆర్‌డిఓ ఆనందయ్య, పంఛాయతీ సెక్రటరీ వసుంధర, మేజర్ పంఛాయతీ సర్పంచ్ పంఛరత్నమ్మ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. మేజర్ పంఛాయతీకి చెందిన కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన వై. శివారెడ్డి రూ. 40,400రూపాయలు వేలం పాట పాడి వారపు సంతను దక్కించుకున్నారు. వేలం పాట 9 నెలలు మాత్రమే కాలపరిమితి అని తెలిపారు.


గ్రామ సచివాలయం-1లో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

## శింగనమల ఎమ్మెల్యేను కలిసిన బిజెపి నాయకులు

పుట్లూరు, జూన్ 28 ప్రభాతవార్త

శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని శుక్రవారం బిజెపి పుట్లూరు మండల అధ్యక్షులు రాగేని రామాంజియాదవ్, తదితరు లు శింగనమలలోని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామాంజియాదవ్ మాట్లాడుతూ పుట్లూరు మండలంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొ న్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి దఫేదార్ నరేంద్రయాదవ్, బిజెపి జిల్లా కార్యవర్గసభ్యులు వెంకటయ్య, జిల్లా కిసాన్‌మోర్చా కార్యదర్శి ఉల్లిగంటిపల్లి ఓబులేసుయాదవ్, తదితరులు వున్నారు.


ఎమ్మెల్యేను కలిసిన బిజెపి నాయకులు

## పదవీ విరమణకు ఆహ్వానం

గాండ్లపెంట, జూన్ 28 ప్రభాతవార్త

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాండ్లపెంటలో జూన్ 30న ప్రధానోపాధ్యాయురాలు జి.మధురాంబ, ఉపాధ్యాయులు కె.జయరాం హెచ్‌అర్షద్ అలీ, వీరి పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా నిర్వహించనున్నట్లు, ప్రతి ఒక్కరిని హృదయ పూర్వక ఆహ్వానం పలుకుతున్నామని ఒక ప్రకటన ద్వారా వారు ఆహ్వానించారు.

## షేక్ బాబ్‌జాన్ నివాసానికి విచ్చేసిన బీజేపి మాజీ ఎమ్మెల్యే

నంబులపూలకుంట, జూన్ 28, ప్రభాతవార్త:

మండల కేంద్రానికి చెందిన ఆంధ్రప్రదేశ్ మైనార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్‌బాబ్‌జాన్ నివాసానికి శుక్రవారం కదిరి బీజేపి మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్.పార్థసారథి, వారి తనయుడు బీజేపి యువ మోర్చా రాష్ట్ర రథసారథి యువనాయకులు మిట్టా వంశీ కృష్ణలు రావడం జరిగింది. వీరిని షేక్ బాబ్‌జాన్ సాధరంగా ఆహ్వానించి శ్రీచత్రపతి శివాజీ చిత్రపటం బహుకరించిన అనంతరం బీజేపి మండల నాయకులు వీరిని సన్మానించారు. వీరితో పాటు మండల అధ్యక్షులు కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి అశోక్, కదిరి పట్టణ అధ్యక్షులు కొత్త రమేష్, జెట్టి ఆంజినేయులు, యువనాయకులు హరినాథ్‌నాయుడు, రాఘవరెడ్డి, చలపతి, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షులు షేక్‌చాంద్‌బాషా, ఓబిసి మోర్చా మండల అధ్యక్షులు కెవి రమణ, సలీం భాషా, నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

యాడికి, జూన్ 28 ప్రభాతవార్త

మండలంలోని పెన్నా సిమెంట్ కర్మాగారంలో కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వర్‌రెడ్డి భార్య పావని (33) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నాగేశ్వర్‌రెడ్డి, పావని దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు వున్నారు. మృతికి కారణాలు తెలియాల్సి వుంది.